క్లుప్తంగా

కొవ్వొత్తులతో నూతన సంవత్సర వేడుకలు



వేమూరు: మండల కేంద్రంలోని రక్షణసైన్యం మందిరంలో నూతనం సంవత్సరం సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. మేజరు డి బాబూరావు కొవ్వొత్తులు వెలిగించి నూతన సంవత్సరం ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు కొవ్వొత్తులతో పాల్గొన్నారు.

పేదలకు నూతన వస్త్రాల పంపిణీ



నిజాంపట్నం: పేదలను ఆదుకోవడంలో ది అపోస్టల్ మిషన్ ట్రస్ట్ ముందుంటుందని ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ పరంజ్యోతి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ జూలు గ్రామంలో అపోస్టల్ చర్చిలో పేదలు, ఒంటరి మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ పేదవారికి సహాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరెక్కడా ఉండదన్నారు.పేద కుటుంబాలకు, ఒంటరి మహిళలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో అపోస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో పేదవారికి మరిన్ని సహాయ కార్యక్రమాలు అందించడంలో ట్రస్ట్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన ఐలవరం విద్యార్థులు



ఐలవరం(భట్టిప్రోలు): గత నెల 30, 31 తేదీలలో ఒంగోలు జిల్లా పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్ కమ్ టోర్నమెంట్ అండర్-17 విభాగంలో బాపట్ల జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఎస్‌కే మహ్మద్ తాలీఫ్ ఉన్నాడు. అండర్-17 బాలికల విభాగంలో ఐలవరం హైస్కూల్ నుంచి కె.యష్మిత, బి.సీతామహాలక్ష్మిలు బాపట్ల జిల్లా తరఫున స్టేట్ టీమ్‌కు ఆడుతున్నారు. ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన సంవత్సర వేడుకల్లో అలరించిన మ్యూజికల్ నైట్



బాపట్ల: నూతన సంవత్సరం సందర్భంగా బాపట్లలోని వి రిసార్ట్స్, గోల్డెన్‌శాండ్ రిసార్ట్స్, మైరా రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్స్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి నూతన సంవత్సరంలోకి అడుగిడే వరకు నిర్వహించిన మ్యూజికల్ నైట్స్ అబ్బురపరిచేవిగా ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతంలో కొత్తపంథాలో సంప్రదాయబద్ధంగా ఈ మ్యూజికల్ నైట్స్ ఏర్పాటు చేయటంతో కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు అక్కడికి చేరుకున్నారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



నగరం: నూతన సంవత్సర వేడుకలను మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పాల్గొని నూతన సంవత్సర కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ శ్రీకృష్ణయ్యను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, తహసీల్దార్ ప్రమీల, పలుశాఖల అధికారులు ఎంపీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంపీపీ అవిష్కరించారు.

బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కోన రఘుపతి



నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి దంపతులు

బాపట్ల: బాపట్ల నియోజకవర్గ అభివృద్ధే ఏకైక అజెండాగా ముందుకు సాగుతున్నామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తన నివాసంలో కేక్ కట్ చేసి వేడుకలను సోమవారం ప్రారంభించారు. బాపట్ల నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకుని కోన రఘుపతికి నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘుపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంక్షేమ పథకాలలోనూ, అభివృద్ధిలోనూ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని సూచించారు. విద్యా కేంద్రంగా ఉండే బాపట్లకు మెడికల్ కళాశాల ఓ పెద్ద వరంగా మారుతుందని కోన వివరించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున పార్టీ నాయ కులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

- గజమాలతో కేసన దంపతులకు సత్కారం



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు దంపతులను సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

నిజాంపట్నం: నూతన సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆకాంక్షించారు. మండలంలోని బొర్రావారిపాలెంలో ఆయన నివాసంలో 2024 నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు జిల్లాల నుంచి బీసీ సంఘ నాయకులు, అభిమానులు తరలివచ్చి శంకరరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపంటలు, సుఖ సంతోషాలతో ప్రతి ఒక్కరూ తులతూగాలని ఆకాంక్షించారు. అనంతరం కేసన శంకరరావు దంపతులను బీసీ సంఘ నాయకులు గజమాలలతో ఘనంగా సత్కరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా నూతన సంవత్సర సంబరాలు



నియోజకవర్గ సమన్వయకర్త అశోక్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, నాయకులు

భట్టిప్రోలు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ నూతన సంవత్సర వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు మండలంలోని 15 గ్రామాలలోని చర్చిల వద్ద, ప్రధాన కూడళ్ల సెంటర్లలో యువకులు డ్యాన్సులతో ఉత్సాహంగా జరుపుకున్నారు. యువతీ, యువకులు చేసిన కేరింతలు, నృత్యాలు అందరినీ కనువిందు చేశాయి. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మండల పరిషత్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలలో, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ ఎదుట రంగవల్లులను తీర్చిదిద్దారు. మహిళా కానిస్టేబుళ్లను ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ అభినందించారు. ఎస్ఎస్ఎఫ్ సాంస్కృతిక విభాగం బాపట్ల నియోజకవర్గ ఖండ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అశోక్‌బాబు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిలను కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దాం



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తదితరులు

చెరుకుపల్లి: రానున్న ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో అంతా ఐకమత్యంగా ఉండి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చెయాలని రేపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంతో పాటు డాక్టర్ ఈవూరి గణేష్ నివాసంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, పలువురు ప్రముఖులు గణేష్ కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ నివాసంలో నియోజక వర్గంలోని నాయకులు కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం నియోజక వర్గంలోని ప్రజలతో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నూతన సంవత్సర సందడి



బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిట్టలవానిపాలెం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో వివిధ పార్టీల నాయకులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండల విద్యాశాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల సభ్యులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ బాజీని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.ఎంపీపీ షేక్ బాజీని ఈవో పీఆర్డీ కె.పద్మజ, గ్రామ కార్యదర్శులు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు ఏట్ర అశ్వినిరెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని అధికారులు, నాయకులు బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతిని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐలవరంలో నేత్రానందంగా శోభాయాత్ర



అక్షింతలతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఐలవరం(భట్టిప్రోలు): అయోధ్య రామమందిరంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రామ మందిర నిర్మాణ తీర్థ ట్రస్ట్ ద్వారా వచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమం సోమవారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రేపల్లె, వేమూరు ఖండ ప్రముఖ్ వరికూటి శివ గోపి మాట్లాడుతూ ఈ అక్షింతల పంపిణీ కార్యక్రమం 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. గ్రామంలో శోభా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమవంకరరావు, నిర్వాహకులు కొతరపు పూర్ణ నరసింహారావు, అవ్వారు వెంకటేశ్వరరావు, సంగాబత్తుని వెంకటేశ్వరరావు, అర్చకులు మురళి, భక్తులు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో బాలరాముని పూజాక్షితల శోభాయాత్ర



తెనాలిటౌన్: ఈ నెల 22న అయోధ్యలో ప్రారంభం కానున్న భవ్య రామాలయ బాలరాముని పూజాక్షితల శోభాయాత్ర పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించి పాల్గొన్నారు. బోసురోడ్డులోని కన్యకాపమేశ్వరి దేవస్థానం నుంచి మార్కెట్ సెంటర్లోని రామాలయం వరకు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ తెనాలిలో ఐదు రోజుల పాటు పూజాక్షితలను గడప గడపకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు మారుతీ రాము, పరిపూర్ణ ప్రసాద్, మైలా హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, బూరెల దుర్గాప్రసాద్, పెనుగొండ వెంకటేశ్వరరావు, కాళహస్తి భవానీప్రసాద్, కాళిదాసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో నూతన సంవత్సర పూజలు

జంపని(వేమూరు): నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం మండల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. వేమూరు మండలంలోని జంపని చెన్నకేశవ ఆలయంలో ప్రముఖ వ్యాపారి నాదెండ్ల సురేష్ దంపతులు పుష్పాలంకరణ సేవ నిర్వహింపజేశారు. పెరవలి మాధవ స్వామి, చావలి వాలేశ్వర స్వామి, వేమూరు రామేశ్వర స్వామి, చదలవాడ హరిహర స్వామి క్షేత్రం, కుచ్చెళ్లపాడు రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో ప్రార్థనలు

వేమూరు: మండల కేంద్రంలోని లూథరన్ చర్చిలో ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. నూతనం సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పాస్టరు హయర్ జోషి ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం: నూతన సంవత్సరం సందర్భంగా క్రైస్తవ సోదరులు ఆదివారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ఆయా ప్రార్థనా మందిరాల పాస్టర్లు, నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. చందోలు గ్రామంలో వెలసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అట్టహాసంగా నూతన సంవత్సరం వేడుకలు

కర్లపాలెం:నూతన సంవత్సర వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఎంపీపీ యారం వనజ తన స్వగృహంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో రాంబాబు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంపీపీ వనజకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కేశవనారాయణ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. యువకులు శనివారం రాత్రి టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకుని ఘనంగా న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు.

చర్చిలకు ఇన్వర్టర్లు పంపిణీ



రేపల్లెరూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పేటేరు పంచాయతీ 13వ వార్డులోని రెండు చర్చిలకు సర్పంచ్ కనపర్తి వసుమతి శ్రీరాములు, మల్లికార్జునరావుల ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన ఇన్వర్టలను గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంత దైవసేవకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అంబటి చంద్రశేఖర్

భట్టిప్రోలు: బైకుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన స్థానికంగా చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కృష్ణా జిల్లా పడమటవారి వీధికి చెందిన గొర్రిపర్తి రమేష్ (33) గత నాలుగు నెలలుగా భట్టిప్రోలు ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. పని పై సోమవారం అతడు స్వగ్రామమైన చల్లపల్లికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

22న ప్రతి ఇంటా దీపాలు వెలగాలి

భట్టిప్రోలు: అయోధ్య రామాలయంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రజలు జయప్రదం చేయాలని ఎస్ఎస్ఎఫ్ సాంస్కృతిక విభాగం బాపట్ల నియోజకవర్గ ఖండ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ సోమవారం కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 22న ప్రతి ఇంటా దీపాలను వెలిగించాలని కోరారు. ఆ పర్వదినాన బాణ సంచా కాల్చి వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు. అయోధ్య శ్రీరాముని అక్షింతలను ప్రజలకు అందించాలన్నారు.

ఈనెల 4నుంచి పెంచిన పింఛన్‌ల పంపిణీ



డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: అవ్వా తాతలు, అక్క చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూతన సంవత్సర కానుకగా పెంచిన పింఛన్ నగదు రూ.3వేలను ఈ నెల నాల్గవ తేదీ నుంచి అన్ని గ్రామాలలో ఒక పండగలా పంపిణీ చేయటం జరుగుతుందని వైసీపీ రేపల్లె నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. గుళ్లపల్లి లోని ఆయన నివాసంలో సోమవారం విలేఖర్లతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వృద్ధాప్య, వితంతు, చేనేతలు, కల్లుగీత కార్మికులు మత్స్యకారులు, చర్మకారులు, ఒంటరి మహిళలు హెచ్ఐవీ బాధితులకు పింఛన్ ను రూ.2,250 పెంచి ఇవ్వటం ప్రారంభించి 2024 సంవత్సరం జనవరి నెల నుంచి రూ.3వేలు అందించటం జరుగుతుందన్నారు. పెంచిన పింఛన్‌ను జనవరి నాల్గవ తేదీ నుంచి జగనన్న ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి అందివ్వటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ఒక పండుగ వాతావర ణంలో పంపిణీ చెస్తున్నట్లు వివరించారు.

అనుభవాలు నేర్పిన పాఠాలతో ముందుకు నడవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



కేక్‌ను కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: గత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ కొత్త ఆలోచనలు, కొత్త లక్ష్యాలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆమె కట్ చేసి అనంతరం మాట్లాడారు. గతంలో మన జీవితాల్లో చోటు చేసుకున్న తీపి, చేదు గుర్తులను జీవితానుభవాలుగా నెమరువేసుకోవాలన్నారు. బంగారు భవిష్యత్‌కై ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారధి, వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా సుబ్బారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హేలా షారోన్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీకృష్ణలు కేక్ కట్ చేశారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, సచివాలయ కేంద్రాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

పార్టీ విజయానికి ఐక్యంగా కృషిచేద్దాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తన స్వగృహంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమూరు నియోజక వర్గం అమర్తలూరు మండలంలోని తన స్వగృహమైన కూచిపూడి గ్రామంలో వేడుకలు జరిగాయి. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అశోక్‌బాబుకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గంలోని వివిధ శాఖల అధికారులు అశోక్ బాబుకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భోజన ఏర్పాటు చేశారు. వేమూరు నియోజక వర్గ ప్రజలందరికీ అశోక్‌బాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేమూరు నియోజక వర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలకు నూతన సంవత్సరం శోభ



రేపల్లెలో గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

రేపల్లె రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాలు ఉదయం నుంచే భక్తుల తాకిడితో కళకళలాడాయి. రేపల్లె పట్టణంలోని పలు ఆలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పూడి రోడ్డులోని కలియుగ దైవం శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. అదేవిధంగా రైలుపేటలోని సాయినాథుని ఆలయం, ఓల్డ్‌టౌన్‌లో గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయం, ఓల్డ్‌టౌన్‌లోని ఉమా మహేశ్వరస్వామి ఆలయం, రైలుపేటలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయాలలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాబా ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లో శ్రీ షిర్డిసాయిబాబా వారి ఆలయంలో నిర్వహించనున్న ధనుర్మాస జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం సుగంధ ద్రవ్యములతో బాబాకు మంగళ స్నానం, శ్రీ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, బాబా వారికి క్షీరం, సుగంధ ద్రవ్యములతో ఏకాదశ రుద్రాభిషేకాలు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

రైల్వేస్టేషన్ సెంటర్‌లో పేదలకు అన్నదానం

తెనాలిటౌన్: రైల్వేస్టేషన్ సెంటర్‌లో శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో బీసీ నాయకులు ఓలేటి శివాజీ తల్లి సాంబ్రాజ్యం జ్ఞాపకార్థం సోమవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ సేవా సమితి ద్వారా సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను, కేతుపల్లి రాంబాబు, సనక శ్రీనివాసరావు, పోతిరెడ్డిపల్లి నాగేశ్వరరావు, టి.చంటి, శివ పాల్గొన్నారు.